ఈ రోజు సిపిఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్ నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము.

– జె.ప్రభాకర్.

---

## రాజ్యాంగ వ్యవస్థపై కేంద్రం దాడులను తిప్పికొట్టాలి

## రాష్ట్రంలో ల్యాండ్ పూలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

**– సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు**

రాజ్యాంగ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులను ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు తిపికొట్టాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘుతువుల పిలుపునిచ్చారు. విజయవాడ ఎంబి విజ్ఞానకేంద్రంలో సిపిఎం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో రెండోరోజైన శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ నెలలో కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా విస్తృతంగా నిరసన, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ ప్రకటించిందన్నారు. ఎపి, తెలంగాణలోనూ విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేసే పనులను శరవేగంగా చేపడుతోదని, దీన్ని దేశం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన పరిణామంగా సిపిఎం భావిస్తోందన్నారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35(ఎ) అధికరణలను రద్దు చేయడం, రాజ్యాంగం వివిధ తరగతులు, ప్రాంతాలకు ఇచ్చిన రాయితీలపై బిజెపి దాడులకు తెగబడుతోందని వివరించారు. అది జమ్మూ, కాశ్మీర్‌కు మాత్రమే కాదు, దేశంలోని అన్ని ప్రాంతాలు, తరగతులపైకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే అనేక ప్రాంతాలకు రాజ్యాంగం భూములు, ఉద్యోగాలు, నియామకాలు విషయంలో ప్రత్యేక రాయితీలను రాజ్యాంగం ఇచ్చిందని తెలిపారు కాశ్మీర్‌కు ఇచ్చిన ప్రత్యేక రాయితీలను కేంద్రం పూర్తిగా రద్దు చేసిందని అన్నారు. మహారాష్ట్రలో రాజ్యాంగ వ్యవస్థను కేంద్ర పక్కన బెట్టి, పూర్తిగా అప్రజాస్వామికంగా వ్యవహరించింది. గవర్నర్, రాష్ట్రపతి, ప్రధాని వ్యవస్థలను కేంద్రం దుర్వినియోగం చేసి మహారాష్ట్ర పీఠాన్ని దక్కించుకోవాలని చూసిందని, అది సాధ్యంగాక పక్కకు తప్పుకుని అవమానం పాలయ్యిందని తెలిపారు. ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగ వ్యవస్థను ధ్వంసం చేయడం ఆందోళనకరమైన పరిణామమని, ఈ విషయాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు సీరియస్‌గా తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ముందుకురావాలని కోరారు.

### కార్పొరేట్ల చేతుల్లోకి ప్రభుత్వ రంగాలు

దేశంలో ఉన్న అన్ని ప్రభుత్వ రంగాలను అమ్మేయడానికి, దాని పెట్టుబడులన్నింటినీ విదేశీ పెట్టుబడులకు అప్పగించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుని, వేగంగా ముందుకు కదులుతోందని తెలిపారు. బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ పెట్రోల్ కంపెనీలు, విద్యుత్ రంగాన్ని, ముఖ్యంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు రంగానికి అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గాన్ని సుగమం చేస్తోంది. పోస్కో కంపెనీని తీసుకొచ్చి స్టీల్ ప్లాంట్‌లోనే మకాం వేయించిందని, ఆ కంపెనీకి 5వేల ఎకరాలు భూములు ఇచ్చి, జాయింట్ యాజమాన్యాన్ని ఏర్పాటు చేయడానికి కేంద్రం సిద్ధపడుతోందని వివరించారు. జాయింట్ యాజమాన్యం నుండి పూర్తి యాజమాన్యాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు పెద్దగా సమయం పట్టదని, ఇటువంటి చర్యలకు పాల్పడి ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని తెలిపారు. పార్లమెంటు సమావేశాల్లో కార్మిక చట్టాలన్నింటినీ నాలుగు లేబర్‌కోడ్‌లు పరిధిలోకి తీసుకొచ్చే పనిని కేంద్రం పూర్తిచేసిందని పేర్కొన్నారు. ఇండస్ట్రీయల్ డిస్ప్యూట్ చట్టం, ఇతర చట్టాలను కలిపి ఒక కోడ్‌గా ప్రవేశపెట్టనుందని తెలిపారు. కార్మికులకు రాజ్యాంగం, చట్టాలు కల్పించిన ప్రాథమిక హక్కుల మీద బిజెపి ప్రభుత్వం దాడులు ప్రారంభించిదని అన్నారు. అందుకనే వీటన్నింటికి వ్యతిరేకంగా వివిధ తరగతులు ఆందోళనలు చేపట్టాయని స్పష్టం చేశారు. జనవరి 8న కార్మిక సంఘాలు, వ్యవసాయకార్మిక, ఇతర సామాజిక సంఘాలు అన్నీ కలిసి దేశవ్యాప్త సమ్మెకు పిలపునిచ్చాయని, వీటన్నింటికీ సిపిఎం పూర్తి మద్దతునిచ్చి, పూర్తి సహకారం అందించాలని నిర్ణయించిందని తెలిపారు.

### ల్యాండ్ పూలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

వైసిపి ప్రభుత్వం భూమి సమస్యని మళ్లీ ముందుకు తీసుకొచ్చిందని, ఈ సమస్యను పేదలు, ప్రజలకు అనుగుణంగా పరిష్కరించేందుకు తీసుకొస్తే మాకెటువంటి అభ్యంతరం లేదని అన్నారు. కానీ వైసిపి భూమి విషయంలో అమలు చేస్తున్న విధానాలు, గతంలో టిడిపి అనుసరించిన విధానాలనే ముందుకు తీసుకెళ్లడం శోచనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతంలో టిడిపి అనుసరించిన తప్పుడు విధానాలను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విమర్శించి, అధికారంలోకి వచ్చాక

అదే బాటలో పయనించడం శోచనీయమని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. ల్యాండ్ పూలింగ్ చట్టం మోసపూరితమైనదని, గతంలో దీన్ని వైసిపి వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. అటువంటి చట్టాన్ని వైసిపి ప్రభుత్వం అన్ని పట్టణాలకు విస్తరించేందుకు జిఒ తీసుకురావడం సరికాదన్నారు.ల్యాండ్ పూలింగ్ చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ భూములను అమ్ముతామని చెప్పిన ప్రభుత్వం, అసైన్డ్, పేదలు సాగుచేసుకుంటున్న భూములను అమ్మేందుకు సిద్ధపడడం సరికాదన్నారు. పేదల భూములు, అసైన్డ్, బి ఫారం పట్టా భూముల జోలికి ప్రభుత్వం వెళ్లకూడదని కోరారు. ఎక్కడైనా ప్రజాప్రయోజనాల దృష్ట్యా భూములు అవసరమైతే సంబంధిత రైతులకు తగిన విధంగా నష్టపరిహారం చెల్లించి తీసుకోవాలని సూచించారు.

**ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలి**

తెలుగు, ఇంగ్లీషు మీడియంలు సమాంతరంగా కొనసాగించాలని, తెలుగు మీడియంను రద్దు చేయకూడదని సిపిఎం కోరుకుంటోందని స్పష్టం చేశారు. పౌరులకు ఇష్టమైన భాషలో చదువుకునే ప్రాథమిక హక్కు, స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందని, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేయడం మంచిదికాదని సూచించారు. ఏ మీడియంలో చదువుకోవాలనే స్వేచ్ఛను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వదిలేయాలని కోరారు. దీనిపై పునరాలోచించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**డిజిపి తన మాట నిలబెట్టుకోవాలి**

చంద్రబాబు అమరావతి పర్యటనకు వెళితే కాన్వాయ్‌పై చెప్పు, రాయి విసిరి భౌతిక దాడి ద్వారా నిరసన తెలపడం ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకమని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరునికి ఉంది అంటూ డిజిపి విడుదల చేసిన ప్రకటనను సిపిఎం స్వాగతిస్తోందని అన్నారు. ఈ నిబంధనను డిజిపి అన్ని పార్టీలకు వర్తింపజేయాలని, కేవలం వైసిపికే పరిమితం చేయవద్దని కోరారు. రానున్న కాలంలో వైసిపితో సహా అన్ని పార్టీలకు ఈ నిబంధన వర్తింపజేయడం ప్రజాస్వామికమవుతోందని తెలిపారు. గతంలో నిరసనకారులను ఇళ్లల్లో నుండి టిడిపి ప్రభుత్వం బయటకు రానిచ్చేదికాదని అన్నారు. నిబంధలకులోబడి, మిగతా పద్ధతిలో నిరసన తెలియజేసేందుకు డిజిపి అనుమతివ్వాలని, డిజిపి తన వ్యాఖ్యలపై భవిష్యత్తులో నిలబడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.